# పురుషుల మనస్తత్వాలు

రచయిత్రి: పొట్లపెల్లి సులోచనాదేవి

ఆనాడు మూడవతేది. జీతంపడి రెండు రోజులయింది. పక్కింటి ఉమా చెప్పిన నుండి నా మస్తిష్కాన్ని బాధపెడ్తుంది. తప్పక చూడాలనిపించింది. ప్రతిఒక్కరు చూడదగ్గ చిత్రమని చూచినవాళ్ళు చెప్పుకుంటుంటే; చూడాలనిపించదు మరీ! ఏపనిచేయబోయినా "చెంచులక్ష్మి" జ్ఞాపకానికొస్తుంది. వారు రాగానే అడుగుదామనుకొన్నాను. చేతిలో డబ్బుకూడా వుంది.

వంటచేద్దామని లేచా, ఆడవారికుంది అదే పనిగా! శ్రీ వివేకానందుడన్నట్లు ఆడవారికి వంటిల్లే దేవాలయమని, వంటపాత్రలు దేవత అని. సరె! మరో ప్రశ్న అడ్డువొచ్చింది. ప్రతీ వారికి ఈ ప్రశ్న అడ్డువస్తుందనుకుంటా. ఏం కూర చేయ్యాలా? అని. వంకాయకూరంటే మావారికి మరీ యిష్టం. వంకాయకూరచేసి వారిని ఆనందపరచాలనిపించింది. మంచి ఎత్తుగడవేశా ననుకున్నాను నాలో నేను. మార్కెటుకువెళ్లి తాజావంకాయలు దానికి కావలసిన సరంజామా తీసుకున్నాను. వంట చేయడంలో నిమగ్నమయ్యాను. ఎన్నడూ వంటచేయడానికి ఇంత కష్టపడలేదనుకుంటా. ఘుమఘుమ వాసనలొస్తుంటే దానిని పీలుస్తు ఆనందాన్ని ఆపుకోలేకపోయా. వాస్తవంలో ఎన్నడుకూడా ఇంత చక్కగా చేయలేదనుకుంటా. ఆ వాసన పీలుస్తునే తిన్నదానిలా కడుపుబ్బిపోయింది. ఈరోజు సినిమాకు పోవడం తథ్యం అనుకున్నాను. వారు ఈ వంటనుచూస్తు ఎంత చక్కగా వుందంటారు నవ్వుతూ. నాకు కావలసింది వారి నవ్వేగా. వారి నవ్వులోనేవుంది అందం నా ఆనందం కూడాను. వారు నవ్వాలని చూస్తువుంటాను. వారి ముత్యాల్లాంటి పలువరుసను చూస్తే వర్ణించాలనిపిస్తుంది. కాని చేతకాదు. నేను కవయిత్రిని కాదుగామరి! నేను దిగులుగా ఉన్నసమయంలో వారిముఖంపైచిరునవ్వులు చిందులు తొక్కుస్తుంటారు. పాలలాంటి పలువరుసను చూస్తు కష్టాలను మరిచిపోతుంటాను. ఇంతలో గోడగడియారం "టంగ్ టంగ్"మని నాలుగు గంటలు కొట్టింది నా ఆలోచన్ని భంగంచేస్తు. ఇక గంటైతే వారు వస్తారు. ఈ గంటసేపు ఎలా గడపడమా అనిపించింది. పక్కింటివారు కూడా యెవరు రారాయె అనుకున్నాను. ఇంతలో చెంచులక్ష్మి జ్ఞాపకానికొచ్చింది. ఇదివరలోగా ప్రహ్లాదుని కథ విన్నాను. ఎంత భక్తుడూ! మహా ఋషులకే దర్శనమీయనటువంటి విష్ణుభగవానుడు బాలునికి దాసుడయ్యాడు. అలాంటి కొడుకులుగన్న తల్లులు ఎంత పుణ్యవతులో నాస్తికుని కడుపున ఆస్తికుడు పుట్టాడు. అంత భక్తుడవడానికి కారణం తల్లియే.

శివాజిని వీరునిచేసి హిందుమత రక్షణకొరకై ప్రోత్సహించింది తల్లియే. అబలలు సబలలు అని నిరూపించింది లక్ష్మీభాయి సింహగర్జనచేస్తు మహమ్మదీయులపై దూకింది రుద్రమదేవి. పురాణాల్లో చూచిన ఈలాంటి వారు అగుపడుతుంటారు. నరకాసురుని వధించింది ఆడదే, భస్మాసురుని భస్మంచేసింది ఆడదే. భక్తురాండ్రలో మీ బాబాయికి సాటి లేరు. మృత్యుంజయురాలైంది సావిత్రి. దేంట్లో చూచినప్పటికి ఆడవాళ్లదే ముందుచేయి. స్త్రీలంటె ఎందుకింత చులకనగా చూస్తారో తెలియదు యీ మగవారు.

గోడగడియారం అయిదు కొట్టడంతో నా ఆలోచనలు ఆగిపోయాయి. వారు వచ్చేవేళ అయింది, స్నానానికి నీళ్ళుపెట్టా.

వారు రావడంరావడమే కస్సుబుస్సు అనుకుంటూవచ్చారు. వారిముఖం ఎఱ్ఱబారివుంది. ముఖకవళికలు చూచేప్పటికి భయంవేసింది. ఆఫీసులో ఏదో తగావా అయిందనుకున్నాను. రావడంతో బట్టలువిడిచి స్నానానికి వెళ్లారు. సహజంగా ఇంట్లో అడుగుపెడ్తూనే నవ్వుతూ వచ్చేవారు. ఈరోజు అలా జరుగనందుకు కోపంగా ఉన్నారనుకున్నాను. భోంచెయ్యడంతో కోపం తగ్గిపోతుంది. పీటవేసి అన్ని సిద్ధపరిచాను. స్నానానంతరం వారు వచ్చి కూర్చున్నారు.

కూర వడ్డించాను. రుచిమాచి మరీ ఉగ్రులయ్యారు. కళ్ళోనుండి మిరుగులు దుమికాయి. నాపయి చేయిచేసుకున్నారు. అదృశ్యం చూచి భయపడిపోయి తలుపులకు ఆనుకొని నిలుచుండిపోయా. వారి ముఖం చూచేప్పటికి కందగడ్డలావుంది. రౌద్రరూపాన్ని చూడలేకపోయా. నవ్వులో ఎంత అందంగా అగుపడుతారో కోపంలో అంత భయంకరంగా కన్పిస్తారు. అసలు విషయం ఏంటో నాకు బోధపడలా. వారు మాటలు అంటూనే వున్నారు. "మనసన్నదీ ఇక్కడ ఉంటేగా! పక్కింటి అచ్చమ్మా బుచ్చమ్మలమీదే వుంటుంది. ఇరువయి నాలుగ్గంటలు పుట్టింటిమీదే వుంటుంది ధ్యానం" పుట్టిల్లు అనేసరికి కోపం ముంచుకొచ్చింది కాని ఏమిచేయగల్గుతాను. కంటికి నీరు తీసుకోవడం తప్ప. దెబ్బకంటె ఆ మాటే కష్టమనిపించింది. అనవసరంగా ఈ మొగజాతి పుట్టింటివారి మీద ఆడిపోసుకుంటారెందుకు?

వారు చివాట్లుపెడ్తున్నప్పటికిని మౌనంగా నిలుచుండిపోయా. నా మౌనం వారి కోపాన్ని చల్లార్చిందనుకుంటా. వారి కోపం తగ్గింది.

"ఏమండీ? అసలు విషయం చెప్పకుండానే మాటలనేస్తున్నారు" అన్నాను.

"ఈమాత్రం వంట చేయలేవు. కనీసం పుస్తకాలయిన చూచి నేర్చుకో!" ఈ మాట వినేప్పటికి నా మనసు నీరైపోయింది. బూడిదలో పోసిన పన్నీరులా వుంది నా శ్రమంత. ఎంతో కష్టపడిచేశాను వంట, బాగులేదంటే మనసు బాధపడదు. నేను కట్టుకున్న ఆశాసౌధాలు కాస్త అడుగంటాయి. అసలు విషయము తెలుసుకుందామని ఉబలాట యెక్కువైంది. విషయం కాస్త చెప్పండి అన్నాను. వారు అదోలాగ చూస్తు కూరలో ఉప్పుండి చస్తేనా అన్నారు. ఈమాట వినేసరికి నాలో నేను నవ్వుకున్నాను. "నలభీమపాకంలోనైన ఉప్పులేందీ" అనే పద్యం జ్ఞాపకానికొచ్చింది. "ఏంటండి! ఉప్పులేకుంటే కొట్టాలా?"అంటూ వెళ్లిపోయాను గదిలోకి. ఆలోచిస్తు కిటికీవద్ద నిలబడిపోయాను. పురుషుల మనస్తత్వాలే విచిత్రంగా వుంటాయి.

నా భుజం తట్టినట్లనిపించింది. ప్రక్కకు చూచాను. పెదాలపై నవ్వుతూ "ఏం! కోపం వచ్చిందా?" అంటూ మందలించారు. అబ్బే! కోపం ఎందుకండి అన్నాను వారి హృదయానికి నా తల నానిస్తు.

"ఏంలేదూ? ఆఫీసులో నాకు మా ఆఫీసరుకు తగువయింది. దానికితోడు ఆకలితో వున్న నాకు ఉప్పులేని కూరపెట్టేసరికి కోపం ఆగక నీమీద చేయివేశా!

ఆc! అన్నట్టు మరిచా ఈరోజు సినిమాకు వెళ్దామ అన్నారు. ఈమాట వినేసరికి ఆనందం పెల్లుబికివచ్చింది. ఏమాట నా నోటిగుండా అడుగుదామనుకున్నానో ఆ మాటే వారి నోటి నుండి వినేప్పటికి ఆనందంకాదు. సంతోషమత్తులో ఆలోచించకుండానే సరే! అన్నాను.

★